క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ,అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

యువత క్రీడల్లో రాణించాలి

నందికొట్కూరు రూరల్ : యువత క్రీడల్లోనూ రాణించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర క్రీడలను నిర్వహిస్తుందని ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, ఎంపీడీఓ శోభారాణి అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు ఆడుదాం ఆంధ్ర స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సంజన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు, రవీంద్రనాయుడు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

నందికొట్కూరు రూరల్ : బడి ఈడు పిల్లలను వారి తల్లిదండ్రులు బడిలో చేర్పించాలని తహసీల్దార్ రాజశేఖర్‌బాబు సూచించారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 15 సంవత్సరాలలోపు పిల్లలను దుకాణాల్లో బాల కార్మికులుగా పనుల్లో పెట్టుకుంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెంచుగిరిజనులకు ఈవీఎంపై అవగాహన



ఈవీఎం పై గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న వీఆర్వో ప్రదీప్

శ్రీశైలం: మేకల బండ చెంచుగూడెంలోని చెంచుగిరిజనులకు ఈవీఎం పనితీరు, ఓటు హక్కుపై వీఆర్వో ప్రదీప్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో చెంచుగిరిజనులకు ఓటు హక్కు వినియోగం, ఈవీఎంలో ఓటు వేసే విధానం గురించి వివరించారు. సందేహాలు నివృత్తి చేశారు.

విద్యుత్ ఉద్యోగులుగా గుర్తించాలి

మహానంది: సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్లను విద్యుత్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ మండల కేంద్రమైన తిమ్మాపురం గ్రామంలో ఉద్యోగులు ఎంపీడీవో శివ నాగజ్యోతికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. అలాగే మహానందిలో ఉద్యోగులు విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ రెడ్డికి వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో నాగ మధు యాదవ్, కృష్ణమూర్తి, అనిల్ కుమార్, రాజశేఖర్, పార్థసారథి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్రీడలు పకడ్బందీగా నిర్వహించాలి

నందికొట్కూరు: అంకితభావంతో ఆడుదాం ఆంధ్ర క్రీడలు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ కిషోర్, ఎంపీడీఓ శోభరాణి సూచించారు. మంగళవారం పట్టణంలోని సాపూర్ ఫంక్షన్ హాల్‌లో ఆడుదాం ఆంధ్ర క్రీడలపై నియోజకవర్గ వలంటీర్‌లకు, వ్యాయామ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆన్‌లైన్ స్కోరింగ్ ఏ విధంగా నమోదు చేయాలనే అంశంపై జిల్లా స్పోర్ట్స్ అథారిటీ తరుపున సుదర్శన్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో శాప్ నంద్యాల, కర్నూలు జిల్లాల కో ఆర్డినేటర్లు ఎస్. రవికుమార్, పీ. శ్రీనాథ్, గేమ్స్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డోరతి, మండలాల ఇన్‌చార్జ్‌లు వీరన్న, వెంకటేశ్వర్లు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

మిడుతూరు: కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల నోడల్ అధికారి, ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలపరిధిలోని తలముడిపి, జలకనూరు గ్రామాల్లో సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, కురువ ఎల్లయ్య అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వివిధ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా మైకో కో- ఆర్డినేటర్ చింత నాగేశ్వరరావు, ఈఓఆర్డీ ఫకృద్దీన్ పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు సత్కారం

నందికొట్కూరు: అధిక ఆదాయం, కేఎంపీఎల్ సాధించిన కండక్టర్లు, డ్రైవర్లను మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో డిపో మేనేజర్ నాగేశ్వరరావు సత్కరించారు. వారికి నగదు బహుమతులను అందజేశారు.

మార్కెట్‌యార్డును మరింత అభివృద్ధి చేస్తాం

- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- రైతులకు తక్కువ ధరకే మార్కెట్‌యార్డ్ గోదాములు
- బస్తాకు రూ.3 చొప్పున, ఒక్క రూపాయితో ఇన్సూరెన్స్



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న మార్కెట్‌యార్డ్ చైర్మన్, డైరెక్టర్లు



పుట్టి ప్రమాదంలో చనిపోయిన శీలం అంకన్న, జయలక్ష్మీ దంపతుల పిల్లలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌ను మరింత అభివృద్ధి చేస్తామని ఎథిక్స్ కమిటీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో మంగళవారం వ్యవసాయ మార్కెట్‌యార్డ్ సాధారణ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌ను రైతులకు ఉపయోగకరంగా అన్ని హంగులతో తీర్చిదిద్దుతామన్నారు. ఇప్పటికే యార్డ్ మంచి ఆదాయంలో ఉందని, ప్రస్తుతం రూ.13కోట్ల 48 లక్షల డిపాజిట్లు ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం సమావేశంలో సభ్యులు 26 అంశాలకు తీర్మాణాలు చేసి, ఆమోదించడం జరిగిందన్నారు. రైతన్నలకు తక్కువ ధరలకే గోదాముల్లో ధాన్యాన్ని భద్రపరుస్తున్నామని చెప్పారు. గతంలో రైతులు ధాన్యాన్ని దాచుకోవాలంటే రూ.5 బస్తాకు చెల్లించడమే కాకుండా రూ 3 లు ఇన్సూరెన్స్ చెల్లించాల్సి ఉండేందన్నారు. ఇది ప్రైవేట్ గోదాముల కంటే ఎక్కువగా ఉండడంతో రైతుల సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో ప్రభుత్వం, కమిషనర్ స్పందించి తక్కువ ధరకే గోదాముల్లో ధాన్యం నిల్వ ఉంచుకునేందుకు అవకాశం కల్పించిందని తెలిపారు. ప్రస్తుతం కేవలం బస్తా ధాన్యానికి రూ.3, ధాన్యం భద్రత కోసం రూ.1 ఇన్సూరెన్స్ కింద చెల్లిస్తే చాలని చెప్పారు. రైతులు వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌గోదాములు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైతు బజార్ కేంద్రాల అభివృద్ధి

ఆత్మకూరు, వెలుగోడు మార్కెట్‌యార్డ్ పరిధిలో రైతు బజార్ కేంద్రాలు అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మార్కెట్‌యార్డ్ పరిధిలో మరిన్ని గోదాములతో పాటు పాత గోదాములకు మరమ్మతులు, రైతులకు ఇంటర్నల్ రహదారులు నూతనంగా టెండర్లు వేసి వాటి అభివృద్ధి కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. . అంతకుమునుపు 26 తీర్మాణాల్లో ఈ ఏడాది జూన్ నుంచి నవంబర్ వరకు వచ్చిన ఆదాయాన్ని కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలు చెల్లింపు, కరెంట్, టెలిఫోన్ బిల్లులు ఇతర అభివృద్ధి పనులకు ఖర్చు తదితర అంశాలను కమిటీ సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ బాలస్వామియాదవ్, కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు రషీద్, డైరెక్టర్లు డి.ఉషారాణి , విక్రమ్ సింగ్, ఏడీఏ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మహానంది: మండలంలోని గోపవరంకు చెందిన వంకే ప్రసాద్ రావుకు మంగళవారం రూ. 27,000 చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.

క్రిస్మస్ సెలబ్రేషన్‌కు రూ.50 వేలు విరాళం

ఆత్మకూరు: పట్టణంలో క్రిస్మస్ వేడుకలు ఆనందంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ఆకాంక్షించారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఆత్మకూరు పాస్టర్లు క్రిస్మస్ సంబరాలకు ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ని ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రిస్మస్ సందర్భంగా రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో యుసీఎల్ఎస్ వ్యవస్థాపకులు శీలం శేషు, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

వెలుగోడు: అభాగ్యులకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన కురువ శ్రీనివాసులు (రైతు) గత మూడు సంవత్సరాల క్రితం తన పొలం వద్ద బోరు బావి దగ్గర నీళ్లు కట్టుకునే సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి అక్కడికి అక్కడే మతి చెందాడు. ఈ మేరకు రైతు భార్య లక్ష్మీదేవికి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. వేల్పనూరు గ్రామానికి చెందిన మత్స్యకారులు శీలం అంకన్న, ఆయన భార్య శీలం జయలక్ష్మి గతేడాది వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు పుట్టి మునిగి మరణించారు. ఈ మేరకు వెలుగోడు మండల ఎంపీపీ లాలం రమేష్ దాతల సహకారంతో ఎమ్మెల్యే శిల్ప చక్రపాణి రెడ్డి చేతుల మీదగా ఇదివరకే రూ.లక్ష 16 వేలు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆ కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.2 లక్షల చెక్కును వారి బంధువులకు ఎమ్మెల్యే అందజేశారు. రేగడగూడూరు గ్రామంలోని సీఎస్ఐ చర్చి నిర్మాణం కోసం ఎమ్మెల్యే తన సొంత నిధులు రూ.50 వేల నగదును కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ దేశం తిరుపంరెడ్డి, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, మండల కార్యదర్శి కే.రామ్మోహన్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు వంగాల నాగేశ్వరరెడ్డి, బన్నూరు అంకిరెడ్డి, వైస్ ఎంపీపీ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీశైలం హుండీ కానుకల లెక్కింపు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలాలయ ఉభయ దేవాలయాల హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించనున్నట్లు దేవస్థానం ఈఓ డి పెద్దిరాజు తెలిపారు. లెక్కింపు అక్కమహాదేవి అలంకార మండపంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మహానందిలో ..

మహానంది: మహానందిలో బుధవారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వారితో పాటు కోదండ రామాలయం, వినాయకనంది, అన్నదాన విభాగం , గో సంరక్షణ విభాగాల్లోని హుండీ కానుకలను లెక్కిస్తారన్నారు. అభిషేక మండపంలో లెక్కింపు కార్యక్రమం ఉంటుందన్నారు.

బరకసంజీవరాయుడికి ప్రత్యేక పూజలు



స్వామి వారకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరక సంజీవరాయ స్వామివార్లకు అమావాస్య (కార్తీక మాసం చివరి రోజు)ను పురస్కరించుకొని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్లకు అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, ఆకుపూజ, పల్లకీసేవ, ఆలయ ఆవరణంలో మన్యసూక్త హోమం తదితర విశేష పూజలను ఆలయ పురోహితులు నరహరి శర్మ, వెంకటేశ్వర్లు శాస్త్రోక్తంగా చేపట్టారు. పారుమంచాల గ్రామానికి చెందిన కేశవ రెడ్డి రామ్మోహన రెడ్డి , ప్రణవి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పేరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు: పేద రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ సూచించారు. మంగళవారం పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. సామాజిక ఆరోగ్య కేంద్రం, పరిసరాలను పరిశీలించారు. వైద్యం ఎలా అందుతుందని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యానికి పెద్ద పీట వేశారన్నారు. రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందించాలని చెప్పారు. అర్ధరాత్రి వేళ్లలో కూడా రోగులకు వైద్యం అందించాలని సూచించారు.

నేడు జూటూరులో ఎమ్మెల్యే పర్యటన

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామానికి నేడు(బుధవారం) ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ రానున్నట్లు సర్పంచు నాయిని సావిత్రమ్మ తెలిపారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాల ప్రాంభోత్సవం చేయనున్నట్లు వెల్లడించారు.

గ్రంథాలయ నిర్మాణానికి సహకరించాలి



గ్రంథాలయ స్థలాన్ని పరిశీలిస్తున్న మద్దూరు సుభాష్ చంద్రబోస్, దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: గ్రంథాలయ నిర్మాణానికి ప్రజలందరూ సహకరించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని గ్రంథాలయ స్థలాన్ని జిల్లా చైర్మన్, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి పరిశీలించారు. జేసీబీతో ముళ్ల పొదలను తొలగించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వం గ్రంథాలయాలకు పెద్ద పీట వేసిందన్నారు. పట్టణ, మండల, గ్రామీణ ప్రాంతాల్లో, పాఠశాలలో లైబ్రరీలను ఏర్పాటు చేసిందని చెప్పారు. పట్టణంలో గ్రంథాలయ నిర్మాణం కోసం రూ. 60 లక్షలు మంజూరు చేస్తునట్లు తెలిపారు. పాత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అద్దె భవనంలో గ్రంథాలయం నిర్వహిస్తున్నారని, సొంత భవన నిర్మాణం కోసం ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. కోర్టులో ఉన్న స్థలం గ్రంథాలయానికి చెందినట్లు తీర్పు వచ్చిందని చెప్పారు. మున్సిపల్ చైర్మన్, అధికారులు, పోలీసుల సహకారంతో త్వరలోనే నూతన భవన నిర్మాణం చేపడతామన్నారు. త్వరగా గ్రంథాలయ నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు, విద్యార్థులకు, నిరుద్యోగులకు అందుబాటులోకి తేవాలని జిల్లా చైర్మన్‌కు సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. శాప్ జిల్లా కో ఆర్డినేటర్ ఎస్. రవికుమార్, మున్సిపల్ కౌన్సిలరు రవూఫ్, గ్రంథాలయ అధికారి మురళి, వైఎస్సార్‌సీపీ నాయకులు బ్రహ్మం, రమేష్, సీపీఐ నాయకులు రఘురామమూర్తి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓంకారేశ్వరుడి ఆదాయం రూ.2.29 లక్షలు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం పుణ్యక్షేత్రంలో స్వామివారి హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ. 2,29,983 ఆదాయం వచ్చినట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. మంగళవారం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ విశ్వనాథరెడ్డి, టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్ ఆధ్వర్యంలో హుండీ కానుకల లెక్కింపు చేపట్టారు. ఈ మేరకు రెండు నెలల 20 రోజులకు ఈ ఆదాయం లభించినట్లు చెప్పారు.

క్రీడా పరికరాల మంజూరు

జూపాడుబంగ్లా: ఆడుదాం-ఆంధ్ర క్రీడాపోటీలకు అవసరమైన క్రీడా పరికరాలు ఎంపీడీఓ కార్యాలయానికి మంజూరయ్యాయి. వీటిని ఆయా పాఠశాలల ప్రదానోపాధ్యాయులకు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ నూర్జహాన్ మంగళవారం తెలిపారు. క్రీడల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఇప్పటికే ఆన్‌లైన్ చేసుకున్నారన్నారు.

సాగులో మెలకువలు పాటించాలి

పాములపాడు: రైతులు వ్యవసాయంలో మెలకువలు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏఓ ఫణీశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మద్దూరు గ్రామంలో వరిలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఎకరాకు సగటున 42 బస్తాల దిగుబడి వచ్చినట్లు తెలిపారు. అంతకుముందు ఆర్బీకే ను తనిఖీ చేశారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన



వడ్లరామాపురంలో బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సిద్ధాపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి, జేసీఎస్ అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బాలస్వామియాదవ్, శేషిరెడ్డి, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మమ్మ అన్నారు. మండలంలోని వడ్లరామాపురం గ్రామంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా రూ.25కోట్లకు పైగా నిధులు నేరుగా అందాయన్నారు. కార్యక్రమంలో రాజారెడ్డి, రవినాయక్,సుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి, శివరాం, రమేష్, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాపురంలో 'పల్లెనిద్ర'

ఆత్మకూరు: మండలంలోని సిద్ధాపురం గ్రామంలో వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం పల్లె నిద్ర నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, జేసీఎస్ అధ్యక్షులు పుల్లారెడ్డి, సర్పంచ్ వెంకటరమణ, ఎస్ఎన్‌తండా సర్పంచ్ నాగులు నాయక్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తుందని, ప్రజలు వైఎస్సార్‌సీపీని మరోమారు ఆదరించాలని కోరారు. మాట ఇస్తే హామీని నెరవేర్చే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. గ్రామంలో రూ.21 కోట్లు నేరుగా ప్రజల అకౌంట్లలో జమ అయ్యాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రవినాయక్, విష్ణువర్ధన్‌రెడ్డి, హనుమంతరెడ్డి, సంజీవరాయుడు, శ్రీధర్‌రెడ్డి, దరగయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహానంది.. భక్తజనసంద్రం



మహానందిలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం



మహానందిలో శాంతి కల్యాణోత్సవ పూజలు

మహానంది: కార్తీక మాసం, అమావాస్య సందర్భంగా మంగళవారం మహానంది ఆలయం భక్తులతో సందడిగా కనిపించింది. వేకువజామున ప్రారంభమైన శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారి దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు దర్శనం కొనసాగింది. భక్తులు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఆర్జిత సేవా టికెట్లు, ప్రసాదాల విక్రయాలు, వసతి గృహాలు, తదితర విభాగాల ద్వారా ఒకేరోజు ఆలయానికి సుమారు రూ.15 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు సమాచారం.

కామేశ్వరీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన

కామేశ్వరీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన వైభవంగా జరిగింది. నంద్యాలకు చెందిన డాక్టర్ రామకృష్ణారెడ్డి ,ఈఓ కాపు చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, రుత్వికులు ఉదయం నుంచి కామేశ్వరీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన, వేదశాస్త్ర సమర్పణము, నీరాజన మంత్ర పుష్పం నిర్వహించారు.

పూర్ణాహుతితో ముగిసిన కార్తీకమాసోత్సవాలు

మహానందిలో నెల రోజుల పాటు జరిగిన కార్తీక మాసోత్సవాలు ముగిశాయి. ఈ మేరకు మంగళవారం స్థానిక యాగశాలలో మహాపూర్ణాహుతి పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి స్థానిక అలంకార మండపంలో శ్రీగంగా,కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లకు శాంతి కళ్యాణం శాస్త్రోక్తంగా చేశారు.

గంగలో లక్షబిల్వాల నిమ్మజ్జనం

మహానందిలో సోమవారం మహానందీశ్వరుడికి లక్షబిల్వార్చన పూజలకు వినియోగించిన బిల్వ పత్రాలకు తెలుగగంగ కాల్వలో నిమజ్జనం చేశారు.

తిమ్మాపురంలో కళ్యాణం

మండల కేంద్రమైన తిమ్మాపురంలో కార్తీకమాసం మంగళవారం అమావాస్య పురస్కరించుకుని శివ పార్వతులు కళ్యాణం వైభవంగా జరిగింది.శివాలయంలోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దంపతులకు అర్చకులు ఆర్.రఘుకుమార్ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

శివతాండవ శబ్దరూపకం



శబ్దరూపకం కార్యక్రమంలో కాపవరపు సుబ్బారావు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం కార్తీకమాసోత్సవాల సందర్భంగా పలు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా, పెద అమిరంకు చెందిన కాపవరపు సుబ్బారావు, బృందం వారి శివ తాండవం శబ్దరూపక కార్యక్రమం భక్తులను అలరించింది. ప్రముఖ మృదంగ విద్వాంసులు సుబ్బారావు ఐదు మృదంగాలతో శివతాండవాల విన్యాసం చేశారు.

ఖరీఫ్ పంటలకు పూర్తిస్థాయిలో నీరిస్తాం

మహానంది : ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటలకు పూర్తి స్థాయిలో నీరిస్తామని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. బండిఆత్మకూరు మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. తెలుగు గంగ కింద పంటలు సాగుచేసిన రైతులకు వీబీర్ ద్వారా నీరందిస్తామన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. నీటి విడుదలపై తెలుగుగంగ ఎస్‌ఈ, సీఈలలో చర్చించామని తెలిపారు. ఎంపీపీ సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో చిన్నారికి గాయాలు

మహానంది: బండిఆత్మకూరు మండలం సంతజూటూరు గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు నాలుగేళ్ల చిన్నారి వెంకట నాగకృష్ణ పిచ్చికుక్క దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం రాత్రి గ్రామంలో జరిగిన అన్నదాన కార్యక్రమానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా పిచ్చికుక్క దాడిచేసింది. కన్నువద్ద తీవ్ర గాయంకావడంతో నంద్యాల ఆసుపత్రికి తీసుకెళ్లారు. కంటి నరాలు దెబ్బతినడంతో వైద్యుల సూచన మేరకు మంగళవారం హైదరాబాద్‌కు తరలించారు.

జూడో పోటీల్లో ప్రతిభ



క్రీడాకారులతో జూడో రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్

నందికొట్కూరు: ఈనెల 9,10,11 తేదీల్లో తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో నవనంది స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని రాష్ట్ర జూడో అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. పట్టణంలోని నవనంది స్కూల్‌లో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను అభినందించారు. 35 కేజీల విభాగం రేవంత్, 30 కేజీల విభాగంలో అల్తాఫ్ అలీ, 40 కేజీల విభాగంలో వరుణ్, 45 కేజీల విభాగంలో భువనేశ్వర్, 66 కేజీల విభాగంలో చరణ్, రజత పతకాలు సాధించారని చెప్పారు.

14 న మౌలాలి స్వామి సరిగెత్తు

కొత్తపల్లి: ఈనెల 14న పాతమాడుగుల గ్రామంలో మౌలాలిస్వామి సరిగెత్తు నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు మంగళవారం తెలిపారు. భక్తులకు ఆర్మీజవాన్ అమ్మిరెడ్డి భోజన సౌకర్యం కల్పిస్తున్నారని చెప్పారు.

వైభవంగా కార్తీక వనభోజనాలు



మహిళలకు జ్ఞాపిక అందజేస్తున్న శ్రీనివాస్ దంపతులు

శ్రీశైలం : మండలంలోని కురమ్మరి (శాలివాహన) సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం హఠకేశ్వరం వద్ద కుమ్మరి శ్రీనివాస్ అధ్యక్షతన వనభోజన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 60 కుటుంబాలు పాల్గొన్నాయి. హాజరైన వారికి శ్రీనివాస్ దంపతులు స్వామివారి జ్ఞాపికను బహూకరించారు.

కొత్తపల్లి: మండల కేంద్రంలోని శ్రీపార్వతీ సమేత తాండవ మల్లేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఆలయ పురోహితులు మల్లికార్జున ఆచారి, ఆలయ పెద్దలతో కలిసి కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. స్వామి అమ్మవార్ల విగ్రహాలను పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు.

దివ్యాంగుల సంక్షేమానికి పెద్ద పీట

నందికొట్కూరు: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని నంద్యాల జిల్లా దివ్యాంగుల హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు మల్‌రెడ్డి నాగన్న అన్నారు. మంగళవారం పట్టణంలోని దివ్యాంగుల కార్యాలయం నుంచి జైకిసాన్ పార్కు వరకు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన దివ్యాంగుల వైద్య శిబిరంలో వైద్యులు సిద్ధారెడ్డి, ఫాతిమా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దివ్యాంగుల సంఘం నాయకులు శేషమ్మ, షేక్షావలి, సరస్వతి, నాగరాజు, హుసేన్ పాల్గొన్నారు.